వేళకాని వేళ బస్సు..

- ఉదయం, సాయంత్రం క్లాసులు మిస్
- సమయం మార్చాలని పలుమార్లు వినతి
- అయినా స్పందించని ఆర్టీసీ అధికారులు
- కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు అవస్థలు


బస్సు కోసం కాలేజీ నుంచి వెళ్లిపోతున్న విద్యార్థినులు

కాప్రా: ఎలాంటి ఒత్తిళ్లు, బాధ్యతలు లేని జీవనం చిన్నారుల సొంతం. ప్రభుత్వం చెబుతున్న బంగారు తెలంగాణలో విద్యార్థుల బంగారు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి సమీపంలోని పట్టణ ప్రాంతానికి వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్సులు లేక చదువులకు ఆటంకం

మేడ్చల్ జిల్లా తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన స్కూల్, కాలేజీ విద్యార్థులు నిత్యం ఈసీఐఎల్‌కు వస్తుంటారు. ఇక్కడ ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో చదువుకునేందుకు ఈ గ్రామాల్లో ఒక్కో గ్రామం నుంచే దాదాపు 30 మంది వస్తుంటారు. ఇక అదే మార్గంలోని గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య లెక్కపెడితే వందల సంఖ్యలో ఉంటుంది. ఇందులో అందరూ పేద, మధ్య తరగతి విద్యార్థులే.. అందులో విద్యార్థినులు కూడా ఎక్కువగానే ఉంటారు.

కాలేజీకి వెళ్లాలంటే కష్టపడాల్సిందేనా..

ఈసీఐఎల్‌లో చాలా ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. చుట్టుపక్కల, సమీప ప్రాంత విద్యార్థులంతా ఇక్కడే చదువుకునేందుకు వస్తుంటారు. కానీ ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో ప్రైవేటు కాలేజీలను ఆశ్రయించక తప్పడంలేదు. కాలేజీ, స్కూల్ ఫీజులే తల్లిదండ్రులకు తలకుమించిన భారం అవుతోంది. దానికి తోడు రవాణా సౌకర్యానికి కూడా చెల్లించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

రవాణా లేక చదువుకు దూరం

స్కూల్, కాలేజీకి వెళ్లాలంటే ఉదయాన్నే ఆ గ్రామాలకు వెళ్లి వచ్చే ఒకే ఒక్క బస్సు దిక్కు. ఆ బస్సు కోస ఉదయం 6 నుంచి 6.30 గంటలలోపు బస్టాప్‌కు చేరుకోవాల్సిందే. ఉదయం 6.30 నుంచి 7 గంటలలోపు బస్సు వస్తుంది. ఆ బస్సు పొరపాటున మిస్ అయ్యిందంటే ఆ రోజు స్కూల్, కాలేజీ డుమ్మా. ఇలా బస్సు కోసం ఉదయం, సాయంత్రం పడరాని పాట్లు పడుతుంటే ఇక కంటినిండా నిద్ర, చదువుకునేందుకు సమయం ఉండటంలేదని వాపోతున్నారు విద్యార్థులు.

బస్సు కోసం.. క్లాస్‌కు డుమ్మా..

తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి తదితర గ్రామాల నుంచి ఈసీఐఎల్‌కు రావాలంటే కుషాయిగూడ డిపోకు చెందిన 241టీ ధర్మారం బస్సు ఒక్కటే దిక్కని చెబుతున్నారు విద్యార్థులు. అది కూడా కష్టపడి ఉదయాన్నే లేచి బస్సు అందుకుని ఈసీఐఎల్‌కు చేరుకునే సరికి ఉదయం 9 నుంచి 9.30 గంటలు దాటుతోంది. దీంతో ఉదయం ఒక క్లాస్ మిస్. ఇక సాయంత్రం 3.30 గంటలలోపే ఈసీఐఎల్ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుంది. ఆ బస్సు కోసం 3 గంటలకే బయలుదేరాల్సిన పరిస్థితి. దీంతో సాయంత్రం మరో ఒకటి, రెండు క్లాసులు మిస్. కాలేజీ అయిపోయిన తరువాత వెళ్లాలనుకుంటే రాత్రి 7 గంటల వరకు వేచి ఉండాల్సిందే. కాలేజీ వేళలకు అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను విద్యార్థులు ఎన్నోసార్లు వేడుకున్నారు. ఎన్నో వినతి పత్రాలు అందజేసినా అధికారుల నుంచి మాత్రం కనీస స్పందన లేదు.

▼ చదవలేకపోతున్నాం



బస్సు సౌకర్యం సరిగ్గా లేక కాలేజీకి రోజూ ఆలస్యంగా వెళ్తున్నాం. ఇంటి నుంచి వచ్చేటప్పుడు కూడా ఏ మాత్రం ఆలస్యమైనా బస్సు మిస్ అవుతోంది. బాగా చదువుకుని మంచి ఉద్యోగం సాధించాలని ఉంది. కానీ బస్సు సౌకర్యం సరిగ్గా లేక చదువు ఎలా ముందుకు సాగుతుందోనని ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ మధ్యలోనే ఆపాల్సి వస్తుందేమోనని భయంగా ఉంది.

\- జె.పావని, ఇంటర్, నర్సంపల్లి

▼ బస్సు సౌకర్యం కల్పించాలి



మా గ్రామం నుంచి ఈసీఐఎల్‌కు నిత్యం దాదాపు 20 మందికి పైగా వస్తాం. కానీ సరైన బస్సులు లేక కాలేజీకి ఆలస్యంగా వచ్చి, సాయంత్రం క్లాసులు వదిలేసి ఇంటికి వెళ్తున్నాం. క్లాసులు మిస్‌కావడంతో చదువులో వెనకబడిపోతున్నాం. ఎగ్జామ్‌లో ఏం రాయాలో అర్థం కావడంలేదు.

\- టి.మేఘన, ఇంటర్, తిమ్మాయిపల్లి.

క్లుప్తంగా...

ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం సుప్రభాత సేవ, ధ్వజ ఊరేగింపు, ధ్వజారోహణం, గరుడహోమం, సాయంత్రం శేషవాహన సేవ నిర్వహించారు. ఆదివారం శ్రీనివాస కళ్యాణం, హనుమత్‌సేవ(రథోత్సవం) ఉంటుందని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు తెలిపారు.

నృత్యోత్సవం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీలక్ష్మీ కూచిపూడి డాన్స్ అకాడమి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యోత్సవం ఆకట్టుకుంది. పలు అంశాల్లో నాట్యగురువులు రమాదేవి రాధికా, రజిత, రామలక్ష్మీల శిష్యబృందం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న కార్పొరేటర్ తదితరులు

రామంతాపూర్: చైతన్య భారతి స్కూల్‌లో శనివారం విద్యార్థుల రూపొందించిన చంద్రయాన్-3, పలు ఇతర నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనను తిలకించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు మాట్లాడుతూ ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత శక్తి బయటకు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీనీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ రాం నర్సయ్య, లలిత, ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా జయంతి వేడుకలు



అల్వాల్: అనాథలు, మానసిక రోగులు, వికలాంగుల జీవితాల్లో వెలుగు నింపిన మానవతావాది మదర్ థెరీసా అని వికలాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు విజయ్ అన్నారు. ఆమె జయంతి వేడుకలను శనివారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేసి నిర్వహించారు. ఆర్.కృష్ణ నాయక్, జి.సురేష్ కుమార్, షేక్ షబానా, టీ.నాగలింగం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై సమీక్ష



మల్లాపూర్: నాచారం డివిజన్‌లో నీటి సరఫరాపై శనివారం జలమండలి జీఎం సంతోష్‌కుమార్‌తో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ సమీక్షించారు. అనంతరం భూగర్భ డ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కుల వృత్తులకు సీఎం కేసీఆర్ అండ

హబ్సిగూడ: ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల పట్టింపులేదని కులవృత్తులు కనుమరుగయ్యాయని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల కుల వృత్తుల ప్రోత్సాహానికి లబ్ధిదారులకు రూ. లక్ష ఆర్థిక సహాయం చెక్కులను శనివారం హబ్సిగూడలోని క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు.

ఓటరు జాబితాలో తప్పులను సరి చేసుకోవాలి


పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న బోడుప్పల్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బోడుప్పల్‌లో శనివారం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమాన్ని చేపట్టగా ఆయన బోడుప్పల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్పెషల్ కాంపెన్ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన, వచ్చేనెల 2, 3 తేదీల్లో కాంపెన్‌లో భాగంగా ఫారం-6 నింపి ఓటరుగా నమోదు, ఫారం-8 నింపి సవరణలు రాతపూర్వకంగా తీసుకోవాలని బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటు నమోదును సద్వినియోగం చేసుకోండి

మల్కాజిగిరి: ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి జి.రాజు అన్నారు. శనివారం పలు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

74 పోలింగ్ బూత్‌లలో..

రామంతాపూర్: 74 పోలింగ్ బూత్‌లలో ఓటరు జాబితా క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ పోలింగ్ బూత్‌లో బీఎల్‌వోలు 18 ఏళ్లు నిండినవారు కొత్త ఓటర్లుగా నమోదు, ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు సవరణ చేసుకోవడంతో పాటు ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకోవడం వంటి పనులు చేపట్టారు. సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 300 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారని, పలువురు సవరణ చేసుకున్నారని క్యాంపెయిన్ సూపర్‌వైజర్లు తెలిపారు. ఆదివారం కూడా క్యాంపెయిన్ కొనసాగుతుందని అన్నారు.


రామంతాపూర్ వార్డు కార్యాలయంలో ఓటర్లుగా నమోదు చేసుకుంటూ..



జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో కేంద్రాన్ని పరిశీలిస్తూ..

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న మల్కాజిగిరి ఇన్‌చార్జి అశోక్

గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహారాష్ట్రకు చెందిన ఓ ఎమ్మెల్యే, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ ఓకేజి అన్నారు. శనివారం గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్‌రావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా అశోక్, జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ కన్వీనర్ సదానంద్‌గౌడ్, రాష్ట్ర నాయకులు వాశంపెట్టి శ్రీనివాస్, నరహరితేజా, శ్రీనివాస్‌ముదిరాజ్, ధన్‌రాజ్, వీకే.మహేష్, గోప్ప రమణారెడ్డి, ఈసం రాకేష్, జీకే.హన్మంతరావు, ఆనంద్, మాశెట్టి అనీల్‌గుప్తా, బండారి రవి, బాలసుబ్రహ్మణ్యం, ప్రకాష్, రాజేష్, మహేష్, మంజుల, స్వర్ణలత, వెంకటకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

అల్వాల్/గౌతంనగర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శనివారం చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు అల్వాల్ నుంచి శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. గౌతంనగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.


అల్వాల్ నుంచి చేవెళ్ల సభకు తరలివెళ్తున్న నందికంటి శ్రీధర్

మైనంపల్లికి మద్దతుగా తరలిన నాయకులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జీఎస్వీ సతీష్‌కుమార్

మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు మద్దతుగా మల్కాజిగిరి డివిజన్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు దూలపల్లిలోని ఆయన నివాసానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి జీఎస్వీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే హయాంలో నియోజకవర్గంలో ఘననీయమైన అభివృద్ధి జరిగిందని, అనేక మంది పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు ఉన్నప్పుడు ఆదుకున్నారని ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్థసారథి, కన్నా, ఆజామ్, సంతోష్, రఘు తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ పర్యటనకు ఏర్పాట్లు



మేడిపల్లి: సీఎం కేసీఆర్ ఈ నెల 31వ తేదీన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి చామకూర మల్లారెడ్డి, రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేసేందుకు పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, పాలకమండలి, పోలీస్‌శాఖ సమన్వయంతో ప్రణాళికలను రూపొందించామన్నారు. నగర పరిధిలో నూతనంగా నిర్మించనున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ భవనానికి భూమిపూజ సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి, మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్ నమ్య పరిశీలించారు.

స్థానికుల సహకారంతో శివాలయాన్ని నిర్మిస్తాం

ఉప్పల్: మతాధిపతులు, స్థానికుల అభిప్రాయం మేరకే ప్రజల సహకారంతో చిలుకానగర్ శివాలయాన్ని పునః నిర్మిస్తామని చిలుకానగర్ పట్టణ పెద్దలు, కులసంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు నిర్ణయం తీసుకున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే కొందరు వ్యక్తుల గుడి నిర్మాణం చప్పుడు కాకుండా చేయడాన్ని వారు తప్పుబట్టారు. శివాలయం ఎవరో ఒక్కరి సొంతం కాదన్నారు. త్వరలో స్థానికులతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి కమిటీ ఆదేశానుసారం గుడిని నిర్మిస్తామని ప్రకటించారు. జల్లి మోహన్, గుడి మధుసూదన్‌రెడ్డి, మొట్టే రమేష్, పున్నమి రాజు, ఈరెల్లి రవిందర్‌రెడ్డి, పల్లె నర్సింగరావు, కుమ్మరి సాయిలు, మొట్టే విజయ్, సున్న రాములు తదితరులు ఉన్నారు.



పర్యావరణ పరిరక్షణకు హరితహారం


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్


హరిత హారంలో మొక్కలు నాటుతున్న మేయర్, కమిషనర్

ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: ఒకే రోజులో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన అర్బన్ బయో డైవర్సిటీ విభాగం అధికారులు ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలు పెద్ద వృక్షాలుగా మారి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వినయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, ఫారెస్టు ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, సుష్మా, బాలుతో పాటు టీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరిత వనంగా తీర్చిదిద్దుదాం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థను హరితవనంగా తీర్చిదిద్దుతామని మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒకే రోజు కోటి మొక్కల కార్యక్రమంలో భాగంగా శనివారం రెండో డివిజన్‌లోని సుశీల టౌన్‌షిప్‌లో 1500 మొక్కలు నాటారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రానున్న రోజుల్లో బోడుప్పల్ నగర పాలక సంస్థ పచ్చని మొక్కలతో దర్శనమిస్తుందన్నారు. హరిత హారంలో నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్ నాయక్, చీరాల నర్సింహ, డి.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


తిరుమలనగర్‌లో మొక్క నాటుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

సాయిప్రియ కాలనీలో హరితహారం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడవ డివిజన్ సాయిప్రియ కాలనీ పార్క్‌లో శనివారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ బైటింటి శారదాఈశ్వర్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్యలు కలిసి మొక్కలు నాటారు. కార్పొరేటర్లు మద్ది యుగేందర్‌రెడ్డి, కొడె పోచయ్య, నవీన్ రెడ్డి, అమర్‌సింగ్, కో ఆప్షన్ సభ్యులు బొడిగె రాందాస్ గౌడ్, ఇర్ఫాన్, డిఈఈ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, సీఐ గోవర్ధనగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్ పార్కులో..

గౌతంనగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. శనివారం జ్యోతినగర్ పార్కులో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. నాయకులు మేకల రాముయాదవ్, హార్టికల్చర్ అధికారి వెంకటేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో..

కుషాయిగూడ: స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కోటి వృక్షార్చనలో భాగంగా శనివారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మొక్కలను నాటారు.


జ్యోతినగర్ పార్కులో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్


సాయిప్రియ కాలనీ పార్క్‌లో మొక్కలను నాటుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కుషాయిగూడ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఏఎస్‌రావునగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహపురి ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సేవ చేయాలనే తపనతో లయన్స్ క్లబ్‌లు వేదికగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. కో ఆర్డినేటర్ మాకవరం శ్రీదేవి, వరప్రసాద్ పాల్గొనగా డాక్టర్లు ఉదయ్, జాగృతి వైద్యసేవలందించారు.

దళిత క్రైస్తవులకు గుర్తింపు ఇచ్చిన పార్టీలకే మద్దతు

ఉప్పల్: ఇటీవల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన 115 అసెంబ్లీ సీట్లలో దళిత క్రైస్తవులకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాద్ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంలో కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాంగ్రెస్ దళిత డిక్లరేషన్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి దళిత క్రైస్తవులు ఓట్లు వేసే పరిస్థితుల్లో లేరని ఆయన పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు గుర్తింపు ఇచ్చిన పార్టీలకే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

బీసీ బంధుతో బీసీల జీవితాల్లో వెలుగు



కుషాయిగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ బంధు పథకం బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం కుషాయిగూడ వార్డు కార్యాలయంలో బీసీ బంధు లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ బంధు పథకం నిరంతర ప్రక్రియ అని దశలవారీగా అర్హులైన బీసీలందరికీ బీసీ బంధు పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.